క్లుప్తంగా

పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులు, తాగునీటి సరఫరా విభాగాలను ఆయన గురువారం పరిశీలించారు. పారిశుద్ధ్యం సమస్య నివారణకు కార్మికులకు పలు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ విభాగంతో సమన్వయం చేసుకుని వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పైపులు లీకేజీలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కిలేశపురం(ఇబ్రహీంపట్నం): జూపూడిలోని కిలేశపురం జగనన్న కాలనీలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీలో లబ్ధిదారులు అధికశాతం తమ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి గృహప్రవేశాలు చేశారు. నివాస యోగ్యమైన కాలనీలో స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖాధికారులు స్తంభాలను ఏర్పాటు చేశారు. వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పర్యవేక్షించారు. స్తంభాల ఏర్పాటుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

తోలుకోడు పీఏసీఎస్ చైర్మన్ మృతి



తోలుకోడు(మైలవరం): మండల పరిధిలోని తోలుకోడు గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చెలికాని వరద వేణుగోపాలరావు గురువారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. చెలికాని వరద వేణుగోపాలరావు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

పొక్లెయిన్ల స్వాధీనం

చాట్రాయి: మండలంలోని చాట్రాయి పెద్ద చెరువులో అక్రమంగా మట్టి తవ్వుతున్న మూడు పొక్లెయిన్లను స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ విశ్వనాథరావు గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బాకీ అడిగినందుకు దాడి



నూజివీడు: తనకివ్వాల్సిన బాకీ అడిగినందుకు మద్యం మత్తులో దాడి చేసిన ఘటన నూజివీడు మండలం గొల్లపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొడ్డు వేణు బాపులపాడు మండలం కొత్తపల్లికి చెందిన షేక్ నూర్జెహాకు రూ.6 వేలు అప్పుగా ఇచ్చాడు. వీరిద్దరూ బుధవారం రాత్రి 8 గంటల సమయంలో మీర్జాపురంలోని మద్యం దుకాణం వద్ద కూర్చొని మద్యం సేవిస్తుండగా వేణు తన బాకీ ఇవ్వాలని నూర్జెహాను అడిగాడు. దీంతో వీరిమధ్య వాగ్వివాదం చోటుచేసుకోగా నూర్జెహా మద్యం సీసాతో వేణుపై దాడి చేశాడు. గాయాలపాలైన వేణును హుటాహుటిన నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాశివునికి విశేష పూజలు



ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లి శ్రీబాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని గురువారం విశేష పూజలు చేశారు. స్వామివారికి ఉదయం రుద్రాభిషేకం, రుద్ర హోమం, సాయంత్రం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలను అర్చకులు దేవులపల్లి సాయి స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వేసవి శిబిరాలతో చిన్నారుల్లో జోష్

- క్రీడలపై ఆసక్తి చూపుతున్న చిన్నారులు
- ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ
- క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణ



శిక్షణ శిబిరంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో వ్యాయామం చేస్తున్న చిన్నారులు

నూజివీడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలతో చిన్నారుల్లో జోష్ నెలకొంది. సమయాన్ని వృథా కాకుండా తమకిష్టమైన ఆటలపై దృష్టి పెట్టి మెలకువలు నేర్చుకుంటున్నారు. నూజివీడు విక్టోరియా పురమందిరం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఫెన్సింగ్‌లలో వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన శిక్షణ శిబిరం నెలాఖరు వరకు కొనసాగుతుంది. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగులో శిక్షణ శిబిరం కొనసాగుతోంది. కోచ్ వాకా నాగరాజు శిక్షణలో పిల్లలు బాస్కెట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడల్లో మెలకువలు నేర్చుకుంటున్నారు.

బాస్కెట్‌బాల్‌కు ఆదరణ..

బాస్కెట్‌బాల్‌కు జిల్లాలోనే అత్యధిక ఆదరణ నూజివీడులో ఉన్న నేపథ్యంలో ఇక్కడ మే 31వ తేదీ వరకు నిర్వహిస్తోన్న ఈ శిబిరానికి పిల్లలు పెద్దఎత్తున వచ్చి శిక్షణ పొందుతున్నారు. 7 నుంచి 17 ఏళ్ల దాదాపు 150 మంది పిల్లలు ఈ శిబిరంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్‌లలో రాణించేందుకు అవసరమైన మెలకువలను నేర్చుకుంటున్నారు. ఏ క్రీడకైనా శరీర పటుత్వం ముఖ్యం కావడంతో ప్రతి రోజూ ముందుగా పిల్లలతో జాగింగ్, వ్యాయామం చేయించిన తరువాత బాస్కెట్‌బాల్ శిక్షణ మొదలవుతుంది. బంతిని పట్టుకుని పరిగెత్తడం, బాస్కెట్‌లో వేయడం, బాస్కెట్‌బాల్‌లో నిబంధనలు, ఇతర మెలకువలను పిల్లలకు వివరిస్తూ ఆటను నేర్పుతున్నారు. వీరికి వ్యాయామోపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు, బాస్కెట్‌బాల్ కోచ్ వాకా నాగరాజు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. పలువురు బాస్కెట్‌బాల్ సీనియర్ క్రీడాకారులను కూడా ఈ శిక్షణ శిబిరానికి తీసుకొచ్చి ఆటలోని మెలకువలను పిల్లలకు తెలియజేప్పిస్తున్నారు. పలువురు పీఈటీలు తమ తోడ్పాటు అందిస్తున్నారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫెన్సింగ్, బాల్‌బ్యాడ్మింటన్ల శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి.



బాస్కెట్‌బాల్ ప్రాక్టీసు చేస్తున్న పిల్లలు

మెలకువలు నేర్పుతున్నాం



వేసవి సెలవులను వృథాగా గడిపే కంటే ఇష్టమైన ఆటలలో తర్ఫీదు పొందితే ఎంతో ఉపయోగం ఉంటుంది. చిన్నారుల ఆసక్తిని బట్టి ఆయా క్రీడల్లో శిక్షణనిస్తున్నాం. చిన్నారులు చక్కగా నేర్చుకుంటున్నారు. ఆటలపై వారిలో ఉన్న ఆసక్తి ఈ శిక్షణ ద్వారా మరింత పెరుగుతుంది. శారీరక ధారుడ్యానికి రెండు పూటలా వ్యాయామం కూడా చేయిస్తున్నాం.

– వాకా నాగరాజు, కోచ్

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



తిరువూరు గ్రంథాలయంలో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు



చాట్రాయి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తిరువూరు: పుస్తక పఠనంతో విద్యార్థులు జ్ఞాపకశక్తి పెంపొందించుకోవచ్చని తెలుగుభాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా తరగతుల్లో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. మాతృభాష అయిన తెలుగులో వ్యాకరణ, వర్ణమాల తప్పక నేర్చుకోవాలని, తెలుగు పద్యాలు అభ్యసించాలని ఉమామహేశ్వరరావు విద్యార్థులకు ఉద్బోధించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని భరతకుమారి, గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల్లో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పుస్తక పఠనం, గణితం, ఇంగ్లిషు బోధన, కథలు చెప్పించడం, క్యారమ్స్ నేర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం

నూజివీడు: యోగ సాధన ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తుందని, విద్యార్థి దశ నుంచే యోగా నేర్చుకొని సాధన చేయాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. నూజివీడు ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులతో యోగ సాధన చేయించారు. విద్యార్థిని శ్రీఖ్యాతి యోగాసనాలు చేస్తూ విద్యార్థులతో అభ్యాసనం చేయించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఈమని శేషయ్య విద్యార్థులకు పంచతంత్ర కథలు చెప్పారు. పంచతంత్ర కథలు నీతిని బోధిస్తాయని, వీటిని ప్రతి విద్యార్థి చదివి ఇందులోని నీతి జీవితంలో ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. నీతికథలను ఇంటికి వెళ్లిన తరువాత స్నేహితులకు కూడా చెప్పాలని సూచించారు. విద్యార్థులు పలు కథల పుస్తకాలు, మహనీయుల చరిత్రను తెలిపే పుస్తకాలను చదివారు.



నూజివీడు గ్రంథాలయంలో యోగాసనాలు వేస్తోన్న విద్యార్థిని

స్పోకెన్ ఇంగ్లిషులో శిక్షణ

ఆగిరిపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. స్పోకెన్ ఇంగ్లిషులో విద్యార్థులు శిక్షణ పొందారు. అనంతరం చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి నష్టపోవద్దు



మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

మైలవరం: దళారులను నమ్మి తక్కువ ధరకు పంటను విక్రయించి, రైతులు నష్టపోవద్దని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోళ్లు గురువారం ముమ్మరంగా జరిగాయి. మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించిన అనంతరం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఏ కష్టం వచ్చినా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు ఇటీవల ఇక్కడ యుద్ధ ప్రాతిపదికన మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించామన్నారు. రైతులకు క్వింటాకు రూ.1,960 మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. తమది రైతు ప్రభుత్వమని, ప్రభుత్వం అందించే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

తిరువూరు: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బీఆర్ తులసీరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరిపారు. కేంద్రం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడం వంటి నిర్ణయాలు తీసుకోవడాన్ని వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. సుందరయ్య చిత్రపటానికి ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.నాగేంద్రప్రసాద్, డాక్టర్ వల్లభనేని రవీంద్ర, గుళ్లపల్లి వెంకటరత్నం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరువూరు: మండలంలోని కొమ్మిరెడ్డిపల్లిలో చికిత్స పొందుతూ మారెపోగు ఏసోబు(35) అనే వ్యక్తి గురువారం మృతిచెందాడు. గత ఆదివారం పొలం పనులకు వెళ్లిన ఆయన అస్వస్థతకు గురి కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని మృతికి పొలం యజమాని కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. కూలి పనులు చేసి జీవించే ఏసోబు మృతితో తమ కుటుంబానికి జీవనోపాధి కరువైందని ఏసోబు కుటుంబ సభ్యులు వాపోయారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టారు.

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



చంద్రాల ప్రాథమిక పాఠశాలలో జాబితా ప్రదర్శిస్తున్న గంగాధరరావు, గోపాల్ తదితరులు

చంద్రాల(మైలవరం): బడి ఈడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ ఆధ్వర్యంలో పాఠశాల పీఎంసీ తల్లిదండ్రుల సమావేశం గురువారం జరిగింది. గ్రామ సర్పంచ్ జే జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ పరిధిలోని 5 ప్లస్ చిన్నారుల జాబితాను ప్రధానోపాధ్యాయుడు ప్రదర్శించారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దయాబాబు, పీఎంసీ చైర్మన్ కె.ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లపై అపోహలు వీడండి

ముసునూరు: ప్రభుత్వం నిర్వహిస్తోన్న మొక్కజొన్న కొనుగోలు విధానాలపై రైతులు అపోహలు వీడాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు సూచించారు. చెక్కపల్లి పీఏసీఎస్ పరిధిలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, తేమ శాతం కొలత, లోడింగ్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ముసునూరు మండలంలో నిర్వహిస్తోన్న మొక్కజొన్న కొనుగోలుపై రైతులు అపోహలు వీడాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రతి గింజకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందని చెప్పారు. ప్రతి కేంద్రంలో తేమ శాతం పరిశీలించి, తరలించడం ప్రభుత్వమే చేస్తోందన్నారు. చెక్కపల్లి పీఏసీఎస్ పరిధిలోని లోపూడి ఆర్బీకే నుంచి ఒక లారీ మొక్కజొన్నను ఆయన మిల్లుకు తరలింపజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కె.రాజానాయన, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



లోపూడిలో మొక్కజొన్న లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరావు తదితరులు

సాగు రైతులకు త్వరలోనే భూ పట్టాలు



ఆగిరిపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉదయ్‌భాస్కరరావు

ఆగిరిపల్లి: ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో సాగు చేసుకునే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే పట్టాలు అందిస్తోందని తహసీల్దార్ మంచిరాజు ఉదయ్ భాస్కరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. 43 మంది అసైన్డ్ భూముల్లో సాగు చేసుకునే రైతులకు 29 ఎకరాలు కేటాయించామన్నారు. ఎంపీపీ గోళ్ల అనూష మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. ఏట చెన్నారావు మాట్లాడుతూ.. రైతు భరోసా పథకానికి అర్హులుండి ఇంకా నమోదు కాని రైతులు వెంటనే ఆర్బీకేలా ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆగిరిపల్లి-2 ఎంపీటీసీ సాదం గోపీనాథ్ మాట్లాడుతూ శోభనాచలస్వామి ఆలయానికి చెందిన వరాహ పుష్కరిణిలో పూడిక తీసేందుకు ఉపాధి హామీ కింద రూ.10 లక్షలు మంజూరై పనులు ప్రారంభించామని చెప్పారు. ఆయా శాఖల అధికారులు ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. వైస్ ఎంపీపీ కె.రమేష్, ఎంపీడీఓ కె.వాణి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఊపందుకున్న అభివృద్ధి పనులు



అమ్మవారి మామిడి తోటలో షెడ్ల నిర్మాణానికి పూర్తయిన బేస్‌మెంట్

పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారి ఆలయానికి సంబంధించిన అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. సుమారు రూ.13.5 కోట్లతో జరగనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అభివృద్ధి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఉమ్మడి జిల్లాలో విజయవాడ దుర్గ గుడి తరువాత స్థానంలో పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ వారి ఆలయం ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, లక్షలాది మంది భక్తుల ఇలవేల్పుగా తిరుపతమ్మ ఆలయం వర్ధిల్లుతోంది. ఆలయ వార్షికాదాయం రూ.8 కోట్ల పైనే ఉంది. నిత్యం వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సారథ్యంలో సుమారు రూ.5 కోట్లతో బేడా మండపం, రాజగోపురంతో పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణం జరిగింది. తిరిగి మరలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉదయభాను సారథ్యంలో సుమారుగా రూ.13.5 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఆలయం వద్ద కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్, మునేరు అవతల షెడ్లు, గదుల నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. వీటి నిర్మాణంపై ఆలయ అధికారులు, పాలకవర్గం కూడా ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ఆలయ ఈఈ వైకుంఠరావు మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మవారి మామిడి తోటలో షెడ్లు, గదుల నిర్మాణంతో పాటు ఆలయం వద్ద కేశ ఖండనశాల, టాయిలెట్ బ్లాక్ పనులు ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద డార్మెటరీ, అమ్మవారి వార్షిక కల్యాణ స్థలం వద్ద అభివృద్ధి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయి.

చెరువు అలుగు వద్ద రూ.30 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం

ప్రభుత్వ విప్ ఉదయభాను



చెరువు అలుగు వద్ద బ్రిడ్జి శంకుస్థాపనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువు కట్టమీద ఉన్న ఆంజనేయస్వామి వారి దేవాలయం సమీపంలో ఊర చెరువు అలుగు వద్ద 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 లక్షలతో నిర్మించనున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా స్థానిక 13, 15 వార్డుల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఈ బ్రిడ్జి రెండు మీటర్ల వెడల్పుతో ఇరుకుగా ఉండటం వలన 13, 15 వార్డుల ప్రజలు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారని తెలిపారు. దీంతో స్థానికుల అభ్యర్థనతో పాటు స్థానిక నాయకుల సూచనల మేరకు 30 మీటర్ల పొడవున, 6 మీటర్ల వెడల్పుతో విశాలమైన బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తిచేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ తన్నీరు నాగమణి, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాబు, సాయిచైతన్య శర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, కాశి కిషోర్, పూసల పుల్లారావు, దువ్వల రామకృష్ణ, వేముల విజయ్, యానాదిరావు, మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు పాల్గొన్నారు.

పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు



కొండూరు గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

నందిగామ: పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలం కొండూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ చిన్న ప్రకాష్ రావు అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్స చేయించుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.3.60 లక్షల చెక్కును గురువారం సామినేని ఉదయభాను అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, పార్టీ ఏటి పట్టు గ్రామాల నాయకులు మేడా కోటేశ్వరరావు, అప్పిగట్ల సురేష్ బాబు, దేవినేని నాగేశ్వరరావు, చెరుకూరి బ్రహ్మం, చావా సురేష్, ఆంజనేయులు, పూర్ణయ్య, రాంబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాట్య కళాపీఠాన్ని సందర్శించిన న్యాయమూర్తి



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యకళాపీఠాన్ని నందిగామ సబ్ జడ్జి ఖాసిం గురువారం కుటుంబ సభ్యులతో సందర్శించారు. కళాపీఠం ప్రిన్స్‌పాల్ వేదాంతం రామలింగ శాస్త్రి ద్వారా కూచిపూడి నాట్య విశేషాలను, చరిత్రలో నిలిచిపోయిన నాట్య కళాకారుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాపీఠం విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలను వీక్షించారు.

నేడు మెగా జాబ్‌మేళా

తిరువూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తిరువూరులో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నరేష్‌కుమార్ తెలిపారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ఎంఎన్‌సీ కంపెనీల్లో పదో తరగతి నుంచి బీటెక్ వరకు అర్హతలు కలిగిన అభ్యర్థులను తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.